క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ ఫర్హత్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ అల్కాపురి ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. 11కేవీ యాదవనగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు.

సీఐ శంకర్‌నాయక్‌కు సన్మానం



శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా విచ్చేసిన సీఐ శంకర్‌నాయక్‌ను బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేషన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పుట్టగళ్ల సంతోష్ ఆధ్వర్యంలో నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గట్టు మహిపాల్, కర్రె బల్వంత్ తదితరులు ఉన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మహేశ్వరం: మండల కేంద్రంలో సీపీఐ రాష్ట్ర నాలుగో మహాసభల వాల్‌పోస్టర్‌ను సీపీఐ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఆగస్టు 19 నుంచి 22 వరకు మేడ్చెల్ జిల్లా మల్కాజిగిరిలో జరిగే మహాసభలకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లాటి యాదయ్య, మండల కార్యదర్శి దేవేందర్‌గౌడ్, నాయకులు బ్రహ్మచారి, రమేశ్, రాంచంద్రయ్య, చంద్రయ్య పలువురు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన నాయకులు



ఢిల్లీ జంతర్‌మంతర్ ధర్నాలో కాంగ్రెస్ నేతలు

మహేశ్వరం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బుధవారం నిర్వహించిన ధర్నాకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. రిజర్వేషన్ల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతటి పోరాటానికైనా సిద్ధమని నేతలు పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు బీసీల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. బీజేపీకి బీసీలను రాజకీయంగా వాడుకోవడమే తప్పా వారి సంక్షేమం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ధర్నాకు తరలిన వారిలో పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, నాయకులు ఆవుల యాదయ్య, హరికిషన్‌గౌడ్, ఘనపురం రాజు ముదిరాజ్, సుధాకర్, పలువురు పాల్గొన్నారు.

ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలవాసులు ముంపు, దోమలతో ఇబ్బంది పడుతున్నామని సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా బుధవారం ఆయన పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముంపు సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందించి త్వరలో వరద నీటి కాలువ, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జలమండలి డీజీఎం రాజగోపాల్, మేనేజర్ సిరివెన్నెల, జీహెచ్‌ఎంసీ ఏఈ గోపాలకృష్ణ, కాలనీలవాసులు శంకరయ్యగౌడ్, పద్మారెడ్డి, కృష్ణరెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, సోమేశ్వరరావు, నరసింహరెడ్డి, సందీప్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేశ్వరరావు, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

చారిత్రాత్మకం.. ఆధ్యాత్మిక సౌరభం

రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ
- భక్తుల కొంగుబంగారం అమ్మవారు
- తెలుగు రాష్ట్రాల నుంచి రాక
- ఈ నెల 11నుంచి ఆలయ వార్షికోత్సవాలు
- ఏర్పాట్లు ముమ్మరం చేసిన నిర్వాహకులు



రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం

తుక్కుగూడ: సర్వశక్తి ఎల్లమ్మ తల్లి. శక్తి స్వరూపిణి. మంగళవారం ఆమె హృదయానికి హత్తుకునే పవిత్ర దినం. ఈ రోజున రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం భక్తజనంతో కిటకిటలాడుతుంటుంది. ఆధ్యాత్మిక సౌరభంతో సూర్యగిరి కొండపై దేదీప్యమానంగా విరాజిల్లుతోంది.

విశిష్టత

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, తుక్కుగూడ పురపాలిక పరిధి రావిర్యాల గ్రామంలో పశ్చిమాన ఎగువ భాగంలో అమ్మవారు కొలువై ఉన్నారు. పచ్చని పంట పొలాల నడుమ ప్రకృతి స్వరూపంగా సూరన్‌గుట్ట మీద ఊడుగు చెట్టు నీడన ఓ రాతికి శక్తి స్వరూపిణిగా ఎల్లమ్మ స్వయంభుంగా వెలసింది. ఆ గుండును పసుపు, కుంకుమలతో పుదుచ్చి, అత్యంత భక్తి శ్రద్ధలతో భక్తజనం కొలుస్తున్నారు. అమ్మవారు వెలిసిన ప్రదేశంలో గుండు చుట్టూ పెద్ద పుట్ట ఉండేంది. అందులో అమ్మవారు నాగదేవత రూపంలో సంచరిస్తుండేదని పూర్వీకులు పేర్కొంటున్నారు. సూరన్‌గుట్ట మీద అమ్మవారు వెలియడంతో సూర్యగిరి ఎల్లమ్మ అని పేరొందింది.

బాపని ఎల్లమ్మ

ఎల్లమ్మ తల్లికి సాధారణంగా ఎక్కడైనా కల్లుసాక పెడతారు. కొన్నిచోట్ల యాటను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. కానీ ఇక్కడ అలాంటివి ఏవీ ఉండవు. పరమాన్నం, బూరెలు, పాలు, పెరుగు నైవేద్యంగా సమర్పిస్తుంటారు. అందుకే ఈ ఎల్లమ్మను బాపని ఎల్లమ్మగా పిలుస్తుంటారు. ఈ ఆలయానికి 100 ఏళ్ల చరిత్ర ఉంది. స్థానిక ఇతిహాసాల ప్రకారం .. ఎల్లమ్మ ఇక్కడ స్వయంభువుగా వెలిశారు. పుణ్య క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు.

11 నుంచి ఉత్సవాలు

అమ్మవారి ఆలయ ఉత్సవాలు ఏటా శ్రావణమాసం మూడో సోమవారం ప్రారంభమై, బుధవారం ముగుస్తాయి. మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. ప్రస్తుతం 42వ వార్షికోత్సవాలు (బోనాలు కల్యాణం) ఈ నెల 11 నుంచి 13వ వరకు దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో జరగనున్నాయి. 11న గణపతి పూజ, అభిషేకం, అమ్మవారి ఘటం ఊరేగింపు. 12న అమ్మవారి కల్యాణం, అగ్నిగుండములు, భక్తులకు అన్నదానం, రావిర్యాల నుంచి ఆలయం వరకు ఘటం, బోనాల ఊరేగింపు. 13న నివేదన, హారతి, తీర్థప్రసాదాల వితరణతో ఉత్సవాలు ముగిస్తాయి.

ఘటం క్రతువు కీలకం

అమ్మవారికి ఉత్సవాల్లో ఘటం ఊరేగింపు కీలకం. ఈ క్రతువును గతంలో ఆలయ ప్రధాన పూజారి మీగడ రామాస్వామి ఊరేగింపు ద్వారా ఆలయానికి అమ్మవారిని తీసుకువచ్చే వారు. ఆయన మరణం అనంతరం ఆయన కుమారుడు కాశీనాథ్ ఈ బాధ్యతలు చేపట్టారు. ఘటం తీయడానికి రావిర్యాల గ్రామస్తులు పోటీ పడతారు. ఏటా ఓ భక్తుడికి అవకాశం లభిస్తుంది.



శిలువపై కొలువైన అమ్మవారు

నాగదేవతకు పూజలు

సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం సంప్రదాయ పూజలకు ప్రసిద్ధి. ఇక్కడ అమ్మవారు శిల రూపంలో ఉంటుంది. తల్లి గుట్టను చీల్చికుంటూ.. భూమాత రూపంతో సంబంధం కలిగి ఉన్నట్లు భక్తులు భావిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని పుట్టలో నాగదేవత ఉంటుందని భక్తుల విశ్వాసం . అక్కడి నాగదేవత విగ్రహానికి పాలుపోసి కోరికలను కోరుకుంటారు. ముడుపు కడుతుంటారు. అనుకున్నది నెరవేరిన వారు.. అమ్మవారికి బోనంను నైవేద్యంగా సమర్పిస్తారు. సామూహికంగా శ్రీ సత్యానారాయణ వ్రతం చేస్తారు.



ఆలయ ప్రాంగణంలో నాగదేవత

భక్తుల విశ్వాసం

భక్తుల కొంగుబంగారం రావిర్యాల ఎల్లమ్మ. బిడ్డల కోరికలు తీరుస్తుందని విశ్వాసం. అందుకే ప్రతి మంగళవారం వేలాది మంది భక్తులు అమ్మవారి సన్నిధికి వస్తుంటారు. అనుకున్నది నేరిన వారు తల్లికి నైవేద్యంగా బోనం సమర్పిస్తారు. సత్యానారాయణ స్వామి వ్రతం చేయిస్తారు.

– రెడ్డిగళ్ల రత్నం, ఆలయ ట్రస్టీ, ఫౌండర్ చైర్మన్

జయప్రదం చేయండి

ఏటా శ్రావణమాసం మూడో వారంలో అమ్మవారి కల్యాణం, బోనాల పండుగ నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా 11వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశాము. ఉత్సవాలను జయప్రదం చేయండి.

– మోహన్‌రావు ఈఓ

ఉత్సవాలను జయప్రదం చేయండి



రావిర్యాల చెరువు కట్ట వద్ద అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

తుక్కుగూడ: ఈ నెల 11 నుంచి జరిగే రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం తుక్కుగూడ పరిధిలోని ఎల్లమ్మ ఆలయాన్ని ఆమె సందర్శించి, ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ ఆలయానికి భూమి ఎక్కువగా లేకపోవడంతో మౌలిక వసతులు కల్పించలేకపోతున్నామన్నారు. ఆలయ పక్కన ఉన్న రైతుల సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే ఆలయానికి సీసీరోడ్డు మంజూరు చేశామన్నారు. ఉత్సవాల ముగింపు అనంతరం రోడ్డు పనులు ప్రారంభించి, పూర్తి చేయాలన్నారు. ఈ ఉత్సవాలకు వేలాది భక్తులు వచ్చే ఆవకాశం ఉన్నందునా ఏర్పాట్లు చేయాలన్నారు. రావిర్యాల చెరువు కట్టపై జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ చెరువు అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేశామని స్పష్టం చేశారు. పనులు త్వరగా పూర్తి చేసి, ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఒక విజన్‌తో పని చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్, మాజీ కౌన్సిలర్లు రవినాయక్, సుమన్, లావణ్య, నాయకులు వెంకటరాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

సైదాబాద్: ఈ నెల 11న ఇందిరాపార్క్ వద్ద టీఎస్‌పీజీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పెన్షనర్ల మహాధర్నాను విజయవంతం చేయాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి కోరారు. బుధవారం సలీంనగర్‌లోని టీఎస్‌పీజీఏ కార్యాలయంలో నిర్వహించిన మహాధర్నా సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉచితాలకు లేని ఆర్థికస్థితి, రాజ్యాంగం కల్పించిన ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్ల హక్కులకు లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న చట్టబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వ పట్టించుకోవడం లేదని తమ డిమాండ్ల సాధనకు మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఓం ప్రకాష్, మదన్‌మోహన్, ప్రసాదరావు, దామోదర్ పాల్గొన్నారు.

తవ్వకాల్లో బయటపడిన విగ్రహం

హనుమాన్ ప్రతిమకు పూజలు చేసిన భక్తులు



పూజలు నిర్వహిస్తున్న స్థానికులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరామకాలనీ ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ భూమి తవ్వకాల్లో ఆంజనేయ స్వామి విగ్రహం బయటపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. సొసైటీలోని ప్రభుత్వ స్థలంలో పార్కును ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపంతో చెట్లు, చెత్తాచెదారం పేరుకుపోయింది. ఈ క్రమంలో యువకులు శ్రీకాంత్, శివ, నాని, వెంకటేశ్, మధుసింగ్‌లు కలిసి జేసీబీ సహాయంతో బుధవారం ఉదయం చదును చేస్తుండగా ఆంజనేయ స్వామి విగ్రహం బయటపడింది. విషయం తెలుసుకున్న పరిసర ప్రాంత ప్రజలు తరలివచ్చారు. విగ్రహాన్ని అక్కడే ప్రతిష్ఠించి, పూజలు చేశారు. స్వయంభుగా స్వామివారు వెలిశారని, త్వరలోనే గుడి నిర్మాణానికి కృషి చేస్తామని పలువురు తెలిపారు. దాతలు సహకరించాలని కోరారు. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ రాఘువేందర్ రెడ్డి.. బందోబస్తును ఏర్పాటు చేశారు.

‘బీసీలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే’

మన్సూరాబాద్: బీసీలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మన్సూరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ధర్నా బీసీల కోసం కాదని, ముస్లింల కోసమన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు అందులో 10శాతం ముస్లింలకు కేటాయించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. బీసీలకే 42శాతం రిజర్వేషన్లు అని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన వెంటనే బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.



కె.ఎల్.కిరణ్‌కుమార్‌కు అవార్డు అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

తెలంగాణ జాతిపిత జయశంకర్ సార్

- కేబీఆర్ పార్కుకు కొత్తపల్లి నామకరణం చేయాలి
- ఆచార్య జయంతిలో వక్తలు
- జయశంకర్ పురస్కారాలు అందజేత

మీర్‌పేట: తెలంగాణ తొలి, మలి ఉద్యమ నిర్మాణంలో కీలక భూమిక పోషించిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్.. తెలంగాణ నిజమైన జాతిపిత అని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్‌చారి అన్నారు. కొత్తపల్లిని తెలంగాణ జాతిపితగా పక్రటించడంతో పాటు.. కేబీఆర్ పార్కుకు ఆయన పేరును పెట్టాలని డిమాండ్ చేశారు. సంఘం రంగారెడ్డి జిల్లా మహనీయుల జయంతి ఉత్సవాల కన్వీనర్ అందోజు దయానంద్‌చారి ఆధ్వర్యంలో బుధవారం మీర్‌పేట కార్పొరేషన్ సహస్ర కన్వెన్షన్‌హాల్‌లో జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు ఏసీపీ కె.ఎల్.కిరణ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ భిక్షపతిచారి, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారి, గణేశ్‌చారి, డా.కనకదుర్గ, సత్యనారాయణ, సుదర్శనచారి, శ్రీనివాసచారి, రఘునందనాచారి, అంజయ్యచారి, దయానందచారిలకు జయశంకర్ అవార్డును అందజేశారు. అనంతరం కార్పొరేటర్ భిక్షపతిచారి, సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారిలు మాట్లాడారు. రాష్ట్ర సాధనలో జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. విశ్వబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని, హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు అందోజు శ్రీనివాసచారి, అందోజు దయానందచారి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణమాచారి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఉపాధ్యక్షుడు విష్ణుచారి, మనుమయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమాచారి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి, నాగోజు రామూ, హస్తినాపురం బీఆర్‌ఎస్ అధ్యక్షులు అందోజు సత్యంచారి, జగ్జీవన్ పాల్గొన్నారు.

కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని వినతి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ కొత్తపేట చౌరస్తాలోని ఓల్డ్ రంగారెడ్డి కోర్టు స్థలంలో బీసీ మర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరుతూ సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్‌కు కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాత కోర్టు స్థలాన్ని హెచ్‌ఎండీఏ నుంచి ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని.. అక్కడ బీసీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని, తద్వారా బీసీ సామాజిక వర్గాలకు ఆర్థిక అభివృద్ధికి మార్గం వేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధి శ్రీధర్‌గౌడ్, ముదిరాజ్ సంఘం నాయకులు జైన్‌బాబు, కుమ్మర సంఘం నుంచి మల్కాజిగిరి కుమార్, పద్మశాలి సంఘం నాయకులు పున్న భాస్కర్, బహుసార క్షత్రియ సంఘం నుంచి నందకుమార్, కబీర్‌దాస్, గోవర్ధన్, సుభాష్, ప్రవీణ్, కాటం రాజు, ఎం.జంగయ్య తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి, బీసీ సంఘాల ప్రతినిధులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సీఐటీయూ నాయకులతో కలిసి కమిషనరేట్ ముట్టడికి తరలివెళ్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఛలో కమిషనరేట్ ముట్టడి కార్యక్రమానికి సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధి నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. రూ.10 వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు గుర్తింపు కార్డులు అందించి, క్రమబద్ధీకరించాలన్నారు. ఏడాదికి నాలుగు జతల బట్టలు ఇవ్వాలని, ప్రభుత్వమే వంట గ్యాస్ సరఫరా చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూరగాయలు, కోడిగుడ్ల ధరలు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో తమ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రభావతి, లక్ష్మమ్మ, విజయమ్మ, లావణ్య, శోభ, అలివేలు, గంగమ్మ, శారద, మంగమ్మ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ సేవలు మరువలేనివి



మహేశ్వరం: జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

మహేశ్వరం: తెలంగాణ ప్రజల గుండెల్లో ప్రొఫెసర్ జయశంకర్ చిరస్థాయిగా నిలిచిపోతారని ప్రిన్సిపాల్ సంగి రమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జయశంకర్ 91వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం మీర్‌పేట బాలాపూర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి, నాయకులు దిండు భూపేశ్‌గౌడ్, బీరప్ప, అనిల్‌యాదవ్, రాజ్‌కుమార్, దయానంద్, సింగం రాజు తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో..

కందుకూరు: తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని మండల పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పులిమామిడి పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దేవేందర్‌నాయక్, ఉపాధ్యాయులు రాజేందర్, కళావతి తదితరులు పాల్గొన్నారు. నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్లోరీ, కృష్ణ, శ్రీవాణి, ఎండీ బషీర్, ఎండీ అబ్దుల్లా, గిరిజ, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని బుధవారం మున్సిపాలిటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలుర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట: బాలాపూర్ చౌరస్తాలో..



కందుకూరు: నేదునూరు జెడ్పీ పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



తుక్కుగూడ: నివాళులర్పిస్తున్న కమిషనర్ వాణి, అధికారులు